REGD. NO. M. 3152

13-11-53 శుక్రవారం

ESTD: 1930
జమీన్‌రైతు
THE ZAMIN RYOT. NELLORE.
2 అణాలు

| సంపుటి 25 | మేనేజింగ్ ఎడిటర్: నెలూరు వెంకట్రామానాయుడు<br>సంపాదకుడు: నెల్లూరు శ్రీరామమూర్తి | సంచిక 46 |
| --- | --- | --- |

నిరుపేద కుటుంబీకుడు - నిస్వార్థ ప్రజాసేవకుడు

## సర్దార్ గౌతు లచ్చన్న

అతి నిరుపేద కుటుంబంనుండి అత్యున్నత స్థితికి వచ్చిన వ్యక్తి శ్రీ గౌతు లచ్చన్న. 1909 ఆగస్టు 16-వ తేది శ్రీకాకుళంజిల్లా బారువలో జన్మించారు. ఆగస్టుమాసం విప్లవ సూచకమైంది. ఆ ప్రభావం లచ్చన్నమీద గూడా వుంది. విద్యార్థిగానే 1930-లో ప్రథమపర్యాయం జైలుకువెళ్ళాడు. 1931 సంవత్సరంలో కల్లుదుకాణాల పికెటింగ్‌లో రెండవసారి శిక్షింపబడ్డాడు. 1940-లో డిటెన్యూగా పుత్తర్యూరాగా, అజ్ఞాతవాసంలో రెండు సంవత్సరాలుండి బర్మాకాండిశీకుల వుద్యమాన్ని నడిపాడు. 1942-లో డిటెయిన్ చేయబడి 1945 అక్టోబరువరకు జైలులోనేవున్నారు.

స్వర్గీయ పుల్లెల శ్యామసుందరరావు జిల్లాలో లచ్చన్నగారి రాజకీయ గురువు. 1933-లో రంగాగారి రైతు రక్షణ యాత్రలలో పాల్గొని ఆనాటినుండి యీనాటివరకు రంగాగారి శిష్యవర్గంలో ప్రథముడుగా వున్నాడు.

లచ్చన్న జమీన్‌రైతు వుద్యమంలో తీవ్రముగా పనిచేశారు. మందసా యెస్టేటులో కాల్పులు జరిగినపుడు లచ్చన్నగారిసేవను రైతాంగం ఎప్పటికీ మరువలేదు. 1940-లో పలాసాలో జరిగిన అఖిలభారత రైతుమహాసభ ఆహ్వానసంఘ కార్యదర్శిగా ఆయనచూపిన ప్రతిభ, ఆయనలోని నిర్మాణశక్తిని, పట్టుదలను ప్రస్ఫుటంచేశాయి. ఆ మహాసభే యీయనకు 'సర్దార్' బిరుదాన్ని ప్రసాదించింది.

లచ్చన్నగారు 1930 నుండి కాంగ్రెస్ ప్రాథమిక సభ్యుడు. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. 1946-లో రంగాగారు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులయినప్పుడు వీరు జాయింట్ సెక్రటరీగా వుండినారు. 1951 ఏప్రెలులో రంగాగారితోపాటు వీరు కాంగ్రెస్ నుండి బయటకువచ్చారు.

లచ్చన్న మితభాషి. చాల ప్రశాంతంగా, ఒడిదుడుకులులేకుండా, ఆలోచించి చక్కగా మాట్లాడుతారు. 1948-లో విశాఖ కార్మిక నియోజకవర్గంనుండి శాసనసభకు ప్రథమ పర్యాయంఎన్నికయ్యారు. తిరుగా 1952-లో శాసనసభకు వచ్చారు.

పార్టీనిర్మాణంలో లచ్చన్నకున్నశక్తి, ఇతర పార్టీలలోగూడా మరొకరికి లేదనిపిస్తుంది. ఆ రెండుజిల్లాలలో ఆయనకు ఎంతమంది యువకులు అనుచరులు! అందులో విద్యాధికులెంతోమందివున్నారు. విశాఖ - శ్రీకాకుళం జిల్లాలలోనే పదిమంది లోక్‌పార్టీశాసనసభ్యులొచ్చారంటే అది కేవలం ఆయన నిర్మాణశక్తి తప్ప వేరుగాదు!

లచ్చన్న మంత్రిగా ఎంతోరాణించగలడు. రైతాంగం, ఇనాం రైతాంగం ఆయననుండి ఎంతో సహాయం ఆశిస్తున్నది.

# మంత్రివర్గంలో లోక్ పార్టీ చేరిక

శ్రీ గౌతు లచ్చన్న గారు 7 తేది మంత్రిగా ప్రమాణం స్వీకరించారు. వ్యవసాయం, అడవులు, హరిజనోద్ధరణ, మత్స్యపరిశ్రమ శాఖలు వారికివ్వబడ్డాయి.

లచ్చన్న గారి నియామకంతో మంత్రివర్గాని కుండిన అస్థిరత్వం తొలగి, స్థిరత్వం కలిగినట్లే మనం భావించుకోవచ్చు. రాష్ట్రంలోగూడా రాజకీయ వాతావరణం అనుకూలంగా మారిపోయింది, రాష్ట్ర క్షేమమే ధ్యేయంగా, వుదాత్తంగా, వుదారంగా, దూరదృష్టితో మూడు పార్టీలు వ్యవహరించగలిగితే, యీ మంత్రి వర్గాన్ని ఎవ్వరూ కదపలేరు. ప్రభుత్వం ఎన్నో అభ్యుదయకర కార్యాలుచేసి, ప్రజా మన్ననలను పొందగలదు.

గవర్నరు త్రివేది లచ్చన్నతో ప్రమాణ స్వీకారం చేయించినట్లు, 37 రోజుల ఆలస్యంగానైనా, ప్రకాశంగారు ధైర్యంగా, చేవ రతుగా



లచ్చన్న గారిని మంత్రివర్గంలోకి తీసుకున్నందుకు వారి నభినందిస్తున్నాము. ఇదే సమైక్యత అక్టోబరు 1 తేదినాడే జరిగివుంటే, వాతావరణం ఎంత సుహృద్భావపూర్వకంగా వుండివుండేది? రాజకీయాలలోగూడా బాధ్యతగల నాయకులు యింతటి పెద్ద పొరపాట్లు చేస్తారంటే బయట ప్రపంచం నమ్మలేదేమో!

సంజీవరెడ్డి ప్రభృతులు యీ సందర్భంలో ఒక్క విషయం ఆలోచించవలసివుంటుంది. అక్టోబరు 1 తేది నాటికి లోక్ పార్టీ వారు కాంగ్రెస్‌లో సహకారసభ్యులు. అనాడు వారిని చెంగలోలుపోకుండావుండి, మంత్రివర్గంలో నిర్మాణ వ్యవహారాలలో బాధ్యత వహించివుంటే, యీపాటికి సమైక్యమగుటకు ఎంత అవకాశముండివుండేదో చూడండి. ఈనాడు వారు సహకార సభ్యత్వాన్నిగూడా వదులుకొని, వేరేపార్టీగా వ్యవహారం జరుపుకుంటున్నారు. సహకార సభ్యులైన లోక్ పార్టీవారు కాంగ్రెస్‌లో విలీనంకాలేకపోయారన్నా, వారు కాంగ్రెస్‌తో వుండిన ఆ మాత్రం సంబంధమైనా త్రెంచివేసుకున్నారన్నా ఆ బాధ్యత వారిదిగాదు, కాంగ్రెసు నాయకులదని ఒప్పుకోక తప్పదు. ఈ గుణపాఠంవల్లనైనా, యికముందైనా, యిలాటి పొరపాట్లు జరుగకుంటే ఆంధ్రరాష్ట్రానికి మంచి భవిష్యత్తు వుంటుందని మనం ఆశించవచ్చు.

లచ్చన్న గారు మంత్రివర్గంలో చేపరతుగానే చేరివుండవచ్చు. తమ పార్టీకి స్వేచ్ఛగా వ్యవహరించే హక్కు వుండవచ్చు. కాని చిన్న చిన్న తగాదాలు, అభిప్రాయభేదాలు, పొరపొచ్చాలు ఎన్నివచ్చినా సర్దుబాటుచేసుకొని, సమైక్యంగా పనిచేసుకొనిపోవుటకు కృషిచేయవలసివుంటుందేగాని, విడిపడే పరిస్థితి కల్పించుకోగూడదని లోక్ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

● 12వ పేజీలో

## పార్లమెంటరీ సెక్రెటరీల నియామకం జరుగుతుందా?

మంత్రులు, స్పీకరు, పార్లమెంటరీ సెక్రెటరీలు, శాసనసభ్యుల జీతాలను నిర్ణయిస్తూ గవర్నరు ఒక ఆర్డినెన్సు ప్రకటించారు. ఆంధ్ర ప్రభుత్వంనుండి వెలువడ్డ మొదటి ఆర్డినెన్సు యిదే! మంత్రులకు, స్పీకరుకు యిల్లు అద్దె, ప్రయాణ భత్యాలతో గూడా నెలకు రు 1500 లు ముట్టుతుంది. పార్లమెంటరీ సెక్రెటరీలంటే అలవెన్సులతోగూడా రూ 750 లు యిస్తారు. ఛీఫ్ పార్లమెంటరీ సెక్రెటరీకి మాత్రం వంద రూపాయలు ఎక్కువిస్తారు. డిప్యూటీ స్పీకరుకు 300, శాసనసభ్యులకు నెలకు రూ 150 లు జీతాలిస్తారు. మదారాసురాష్ట్రంలో వున్నప్పటికి, యిప్పటికీ జీతాలలో తేడాఏమీలేదు. కాకుంటే క్రొత్తసంసారం కాబట్టి, తెలిసినట్లు వుంటుందని క్రొత్తప్రకటన మాత్రమే!

ఇందులో పార్లమెంటరీ సెక్రెటరీల ప్రసక్తి రావడం పూర్వాచారాలకు అవకాశంకల్పిస్తున్నది. క్రొత్తగా ఏమైనా సెక్రెటరీల రూపంగా కొందరికి అవకాశం కల్పిస్తారేమోనని. కాని సంజీవరెడ్డిగారు 'యీ సంవత్సరానికి' ఎలాంటి పెంపకం వుండదన్నారు. అందువల్ల యీ సంవత్సరం తీరిపోయినా, వచ్చేసంవత్సరానికి (అంటే 45 రోజుల తర్వాత)వుంటాయేమోచూడవలసివుంది.

## అధికాహారోత్పత్తికి సాధనం శ్రేష్ఠమైన ఎరువులే!

INDO-AGRI LIMITED
STAR BRAND
FERTILISERS
MANAGING AGENTS SHAW WALLACE & CO. LTD. MADRAS

అన్ని పైర్లకు అత్యంత వుపయోగకరమైనవి. ఒక్కసారి వాడి చూచిన ప్రతిరైతు వాటిశ్రేష్ఠతను - ప్రత్యేకతను గుర్తించగలడు.
క్రొత్తగోతాలు - పీల్డుబస్తాలు - 80 పౌన్లు వుంటుంది.
శాస్త్రజ్ఞులచే అపడి ఫ్యాక్టరీలో తయారుకాబడు మేటి యెరువులు.

మా ★ మార్కు
షావాలెస్
ప్యాడీమిక్చర్

నెల్లూరుజిల్లా డిస్ట్రిబ్యూటరు

చుండూరు సుబ్బయ్యశెట్టి - - - హెడ్డాఫీసు:- నవాబుపేట - నెల్లూరు

బ్రాంచీలు:. కొడవలూరు (శ్రీ దూడల రంగయ్యగారి మిషనులో) :: స్టోనాహవుస్ పేట:. శ్రీ బొండా వెంకటసుబ్రహ్మణ్యము - వస్త్రుపట్టీ.

# కర్నూలు: వార్తలు వ్యాఖ్యలు

స్టేట్ కౌన్సిలుకు అధికంగా వచ్చే మూడు స్థానాలకు తొమ్మిదిమంది నామినేషన్లు వేయగా, రెండు నిరాకరించబడినవి. ప్రజా సోషలిస్టు మద్దతు, లోక్ పార్టీ బొప్పన సాను ముంతిరావుగారల నామినేషన్లు కొట్టివేశారు. పోగా అద్దూరు బలరామరెడ్డి (కాంగ్రెస్). నందూరు ప్రసాదరావు, జి. వి. కె. భల్లభరావు (కమ్యూనిస్టులు). గ్రొవ్విడి లింగరాజు, యస్. నాగప్ప (ప్రజాసోషలిస్టులు), వి. వి. రమణ (లోక్), సత్యరాజా శ్రీ కృష్ణసుందరం (స్వతంత్రి) గారల నామినేషన్లు నిలిచాయి. 12 తేది ఉపసంహరణకు ఆఖరుగడువు. కాని ఎవ్వరూ ఉపసంహరించుకోలేదని తెలుస్తున్నది.

ఇందులో ప్రజాసోషలిస్టు అభ్యర్థి నిర్ణయం జరుగవలసివుంది. విశ్వనాథంగారు నిర్ణయించిన అభ్యర్థి వుండి, తక్కిన అభ్యర్థి విరమించుకో వచ్చు. కమ్యూనిస్టుపార్టీ తమ అభ్యర్థిగా నందూరు ప్రసాదరావుగారిని నిర్ణయించింది. ఈ మూడు స్థానాల్లో రెండు ప్రజాస్వామ్య వర్గాలకు, ఒకటి కమ్యూనిస్టులకు పోతవి. ప్రజాస్వామ్య వర్గాల రెండింటిలో ఒకటి కాంగ్రెసుకు, తక్కినది ప్రజా, లోక్ వర్గాలలో ఎవరో ఒకరికి పోతుంది. ఈ ముగ్గురూ కలిసి పనిచేసు కుంటే యీ రెండు స్థానాలు, సంజీవరెడ్డిగారి సీటు పొందుటకు అవకాశముంటుంది.

లోక్ పార్టీ అభ్యర్థి శ్రీ వి. వి. రమణ యం. ఏ. వరకు చదివిన విద్యాధికుడైన యువకుడు. శ్రీకాకుళంజిల్లావాడు. రాష్ట్రపార్టీ ఆర్గనైజరు.

అల్లూరి సత్యనారాయణరాజుగారిని కాంగ్రెస్ అభ్యర్థిగా సంజీవరెడ్డిగారి స్థానానికి నిర్ణయించారు. పాపం! మాజీ కేంద్ర ఉపమంత్రి తిరుమలరావు ఆశాభంగాన్ని పొందవలసి వచ్చింది. ఈ స్థానానికి మరిద్దరి పోటీవుంది. కాని ఆ యిద్దరు నామినేషన్లు వుంటారో, రద్దుగావింపబడతారో చూస్తామని సత్యనారాయణరాజుగారు కర్నూలులో చెబుతున్నారు.

* * *

మన మంత్రులు బాధ్యతగల పదవులలో వున్నామనేది మరచి, మామూలు వుపన్యాస ధోరణిలోనే మాటలు దంచివేస్తున్నారు. అందులో కోటిరెడ్డి, విశ్వనాథంగారలు చర్చించని, అభిప్రాయమివ్వని సమస్యంటూ మిగలలేదు. కౌలుదారి బిల్లని విశ్వనాథంగారంటున్నారు; అలాంటిదేదీ యింకా లేదనీ ముఖ్యమంత్రి ప్రకటించారు. అట్లనే ప్రతి విషయంలో మంత్రులు చెప్పడం, ముఖ్యమంత్రి కాదనవలసిన పరిస్థితులు తెచ్చిపెడుతున్నారు. అసలు యీ యిద్దరు మంత్రులు యీ 43 రోజులుగా ఏ మూడు నాలుగు రోజులుమాత్రమే రాజధాని కర్నూలులో వున్నట్లుంది. తక్కిన కాలాన్నంతా సంచారాల్లోనే గడిపివేస్తున్నారు. క్రొత్త రాష్ట్రం. ఎన్నో క్రొత్త సా కెదురుకోవలసిన సమయం. అలాంటిది వదలి, శీతంమీద పడటం సముచితంగాదు. ప్రకాశం గారుమాత్రం కాలు, పెదవి రెండూ కదలించ డంలేదు.

ఎంతో అనుభవమున్న విశ్వనాథంగారు మాటలలో ఎంత తొందరపడుతున్నారో ఒక్క సాదృశ్యంచెప్తే బోధపడుతుంది. మంగళ గిరిలో చేనేతవారి కష్టాలనుగూర్చి చెప్తు న్నారు. ప్రాతలో యిచ్చిండి విజయవాడకు పోయి ఆ మంత్రికి ఫోనులో చెప్తాను అని అం టాడు విశ్వనాథం. ఇంత తొందరపాటితే పరిపాలన సాగించగలుగుతారా?

తిమ్మారెడ్డి, సంజీవయ్యగారలు మాత్రం తమ కార్యక్రమం ప్రకారం ప్రతి ఆదివారం ఏదో ఒక గ్రామానికిపోయి, అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామస్థులతో కలిసి పనిచేస్తున్నారు.

* * *

23 తేది సభాపతియొక్క కార్యాలయపు స్పీకరుగా శ్రీ ఎకా. ఆ. యల్. నరసింహారావు గారిని నియమించారు. స్పీకరు ఎన్నికనుబట్టి, మార్పు గల్పించవలసివచ్చి యీ యావత్ తప్పుకుంటారు. స్పీకరు పదవికి తిమ్మారెడ్డిగారో లేక లక్ష్మీనరసింహంగారో వుండవచ్చునని తోస్తున్నది.

---

(మొదటి పేజీ కొరవ)

మంత్రులను ఎన్నుకోవడం, వారికి శాఖలను నిర్ణయించడం కేవలం ముఖ్యమంత్రికి సంబంధించినవేనంటారు. కాని ముఖ్యమంత్రి కూడా అన్నీ ఆలోచించి, ఏర్పాట్లు న్యాయంగా వుండేటట్లు చేయవలసివుంటుంది. మన ఆంధ్రకు సంబంధించినంతవరకు మంత్రుల ఎన్నిక బాగున్నదనే చెప్పవచ్చు. కాని శాఖల నిర్ణయంలో అందరికి న్యాయం జరుగ లేదు. లచ్చన్నకు ఒక్క వ్యవసాయశాఖ మాత్రం యివ్వబడింది. ఏ యిద్దరు ముగ్గురికో, వున్న ముఖ్యమైన శాఖలను కేటాయిస్తు న్నారు. మంత్రివర్గంలో మూడు వర్గాలవారూ వున్నపుడు, పార్టీపాలిటిక్సుకూడా అసంతృప్తి లేనివిధంగా కేటాయింపులు చేస్తే బాగుంటుంది. రివిన్యూశాఖను లచ్చన్నగారికిచ్చి, పి. డబ్ల్యు. డి. ని కోటిరెడ్డిగారికి మార్చివుండవచ్చు. లచ్చన్న రాజకీయ జీవితం రైతులమధ్య, రైతు సమస్యలతోనే ప్రారంభమైంది. గత జనరల్ ఎన్నికల అనంతరంకూడా ఇనాములు, సర్ చార్జి బిల్లు వగైరా అనేక విషయాల్లో ప్రభుత్వంతో పోరాడి లచ్చన్న రైతులకెంతో వుపకారం చేశారు. అలాంటి వ్యక్తికి రివిన్యూ శాఖ ఇచ్చివుంటే దేశములోకెల్ల వున్న ఇనాంరైతులు ఎంతో ఆనందపడివుండేవారు. ఏకంబరు ఆఖరులో శాఖల విభజనలో కొంత మార్పువుండ వచ్చునంటున్నారు. అట్లాడైనా లచ్చన్నగారికి రివిన్యూ యివ్వడం బాగుంటుందని ముఖ్య మంత్రికి మనవిచేస్తున్నాము.

శ్రీకాకుళంజిల్లాకు మంత్రిపదవి లభించడం యిదే ప్రథమమనుకుంటాము. లచ్చన్న గారు మంత్రివర్గంలోకి పోయినతర్వాత, వుత్తర విశాఖలకు మూడు మంత్రిత్వాలు లభించా యన్నమాట- ప్రకాశంపంతులు, విశ్వనాథం- లచ్చన్న. రాష్ట్రమంత్రిత్వాలేగాదు, కేంద్ర మంత్రిత్వంకూడా- కార్మికమంత్రి శ్రీ గిరిగారు విశాఖనుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యుడు. ఈదఫామాత్రం జనాభాలో, వైశాల్యంలో పెద్దవైన విశాఖ జిల్లాలకు మంచి న్యాయమే జరిగింది. వుత్తరవిశాఖలలో లోక్, ప్రజాసోషలిస్టుపార్టీలే ఎక్కువ సంఖ్యలో వచ్చాయి. అందువల్లనే మంత్రిత్వాలుకూడా ఆ రెండు పార్టీలకే లభ్యమయ్యాయి.

మంత్రిఅయిన లచ్చన్నగారికి మా అభినంద నములు.

—మా రాజకీయ పరిశీలకుడు.


ఆంధ్రదేశమంతా దిగ్విజయముగా నడుచుచున్నది

ప్రసాద్ ఆర్టుపిక్చర్సువారి

"పెంపుడుకొడుకు"



— తారాగణం —

ప్రసాద్ – యస్. వి. రంగారావు, గణేశన్ - శ్రీరామమూర్తి - సురభి బాలసరస్వతి - సావిత్రి - పుష్పవల్లి, కుమారి మొదలగువారు

డైరెక్షన్ : యల్. వి. ప్రసాద్

మ్యూజిక్ : రాజేశ్వరరావు

స్టూడియో : వాహిని

★ ★ ★ ★

—: డిస్ట్రిబ్యూటర్సు :—

ఆంధ్ర - సీడెడ్ : నవయుగాఫిలిమ్సు లిమిటెడ్, విజయవాడ – గుంటూర్

నైజామ్ : ప్రీమియర్ పిక్చర్సు, సికిందాబాద్

మైసూరు : విజయాటాకీ డిస్ట్రిబ్యూటర్సు, బెంగుళూరు.


Edited, Printed and Published by N. Sree Ramamurthy, at the Zamin Ryot Power Press, 170, Thipparajuvari St. Nellore.